క్లుప్తంగా

గ్రంథాలయాలకు పుస్తకాల వితరణ



గ్రంథాలను అందజేస్తున్న సమితి సభ్యుడు

సదుం: మండల కేంద్రంలోని గ్రంథాలయానికి ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్ బుధవారం పుస్తకాలను వితరణగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీత ప్రచారంలో భాగంగా ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన 27 సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలను అందజేసినట్టు వివరించారు. పాఠకులలో ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు.

మోడల్‌స్కూల్ టాపర్‌గా ధరణి

రీ వాల్యుయేషన్‌లో 9 మార్కులు అదనం



పుంగనూరు: మండలంలోని అడవినాథునికుంట మోడల్ స్కూల్ విద్యార్థిని ధరణి పదోతరగతి పరీక్షల్లో తక్కువ మార్కులు రావడం రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసింది. రీవాల్యుయేషన్‌లో హిందీలో 9 మార్కులు అధికంగా రావడంతో 581 మార్కులతో ధరణి మోడల్‌స్కూల్ టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రమా బాలికను అభినందించారు.

కూలేందుకు సిద్ధం..



పుంగనూరు: పట్టణంలోని మెట్లవారి సంధులో విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆప్రాంత వాసులు పేర్కొంటున్నారు. పెను ప్రమాదం సంభవించక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేడుకగా మండల పూజ



ప్రత్యేకాలంకారంలో పెద్దపులి గంగమ్మ

పలమనేరు: మండలంలోని మొరం గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దపులి గంగ మ్మ ఆలయంలో బుధవారం మండలపూజ ఘనంగా నిర్వహించారు. హోమాలు, ప్రత్యేక పూజలను చేపట్టారు. భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మద్యం అక్రమరవాణా వాహనదారులకు నోటీసులు

పలమనేరు: పలమనేరు సెబ్ పరిధిలో 2022–23లో మద్యాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు సంబంధించి యజమానులకు షోకాజ్ నోటీసులను పంపుతున్నట్టు స్థానిక సెబ్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నోటీసులు అందుకున్న వారు స్థానిక కార్యాలయానికి వచ్చి సరైన కారణాలను తెలిపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. లేదంటే ఆ వాహనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తామని తెలియజేశారు.

ఎక్సైజ్ వాహనాల వేలం రేపు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (సెబ్) రూరల్ స్టేషన్‌లో శుక్రవారం పలు వాహనాలను వేలం వేయనున్నట్లు సీఐ హరికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. మిట్టూరులో ఉన్న తమ స్టేషన్ ఆవరణలో ఉదయం 10 గంటలకు బహిరంగ వేలంపాట జరుగుతుందన్నారు. మద్యం తరలిస్తూ పట్టుబడ్డ ఓ కారుతో పాటు ఏడు ద్విచక్రవాహనాలను వేలం వేయనున్నట్లు తెలిపారు.

వేసవి సెలవుల్లోనే బదిలీలు నిర్వహించాలి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి ఏడాది వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించాలని ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ కోరారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ బదిలీల చట్టంపై విజయవాడలో రాష్ట్ర పాఠశాల విద్య సర్వీసెస్ జేడీ మువ్వా రామలింగం సూచనలు కోరినట్లు వివరించారు. ఆపస్ సంఘం తరపున జేడీని కలిసి బదిలీ యాక్ట్‌కు సంబంధించిన సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న బదిలీల యాక్ట్ ను రూపొందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సిఫార్సు బదిలీలను అంగీకరించకూడదని డిమాండ్ చేశారు. కనీసం రెండు సంవత్సరాలు, గరిష్టంగా ఆరేళ్లు పనిచేసిన వారికి అవకాశం కల్పించాలని కోరారు. పాఠశాల కేటగిరీల్లో మండల కేంద్రాలను ప్రత్యేక కేటగిరీలుగా గుర్తించాలని చెప్పారు.

అల్లర్లను సృష్టిస్తే ఉపేక్షించం



సదుంలో పోలీసుల కవాతు

పుంగనూరు: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎవరు గెలిచినా, ఓడిన ఇరు పార్టీల వారు సంయమనంతో ఉండాలని, అల్లర్లను సృష్టించి శాంతభద్రతలకు విఘాతం కల్పిస్తే ఉపేక్షించమని పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్ హెచ్చరించారు. బుధవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సీఐ రాఘవ రెడ్డితో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. జూన్ 9 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల ఫలితాల సందర్భంగా ఎవరు హద్దులు దాటి ప్రవర్తించినా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ఫలితాలను స్వీకరించాలన్నారు. కక్షలతో సాధించేది ఏమి లేదని, కేసుల్లో ఇరుక్కోవడం ఖాయమని హెచ్చరించారు. ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని తెలిపారు. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, మఫ్టీ పోలీసులతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రజలు స్వచ్ఛందంగా సమాచారం అందించాలని కోరారు. ఎస్ఐ రఫిక్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

9వ తేదీ వరకు 144 సెక్షన్ అమలు

సదుం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు డీఎస్పీ విష్ణు రఘువీర్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరిగినా భద్రతా బలగాలు వెంటనే అక్కడికి చేరుకునేలా చర్యలు చేపట్టామన్నారు. సామాన్యులకు ఏవైనా సమస్యలు ఎదురైతే 100కు గానీ, పోలీసులకు గానీ ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. కౌంటింగ్ సందర్భంగా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. జూన్ తొమ్మిదో తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని సూచించారు. అనంతరం ప్రజల్లో మనోస్థైర్యం పెంపొందించేందుకు మండల కేంద్రంలో కవాతు నిర్వహించారు. రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ షేక్‌షావలి తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరు: మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణురఘువీర్, పక్కన సీఐ రాఘవరెడ్డి

వైభవం.. ధర్మరాజస్వామి పట్టాభిషేకం



గుడుపల్లి: మండలంలోని యామగానిపల్లెలోని శ్రీద్రౌపదీ ధర్మరాజస్వామి మహాభారత మహోత్సవాల్లో చివరి రోజు బుధవారం ధర్మరాజస్వామి పట్టాభిషేకం అత్యంత వైభవంగా జరిగింది. 18 రోజులపాటు ఆలయంలో మహా భారతంలోని కౌరవులు, పాండవుల జననం నుంచి మరణం వరకు హరికథ, నాటక ఘట్టాలను పూర్తి చేశారు. చివరి రోజున పోతురాజు పూర్వజన్మ వృత్తాంతం హరికథా గానం చేశారు. ద్రౌపదీ అమ్మ వారి ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగించారు. ఇంటింటి వద్ద భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఊరేగింపు ఆలయానికి చేరుకున్న అనంతరం మహిళలు పొంగళ్లు పెట్టి నివేదించారు. తదుపరి అశేష భక్తుల నడుమ ధర్మరాజస్వామి పట్టాభిషేకం వైభవంగా జరిగింది.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సచివాలయ సిబ్బందిని కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వర్షాకాలం కావడంతో పారిశుద్ధ్య లోపంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వీధుల్లో చెత్త చెదారం లేకుండా, కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ప్రజల అనారోగ్య సమస్యలపై సర్వే చేపట్టాలని తెలిపారు. ముఖ్యంగా మంచినీరు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. సచివాలయ శానిటరీ, అమెనిటీస్, కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మండలాల్లో ప్రత్యేక ప్రతిభావంతుల గుర్తింపు సర్వే



రామకుప్పం: సర్వే చేస్తున్న సహిత ఉపాధ్యాయిని



వి.కోట : సర్వే చేస్తున్న సహిత ఉపాధ్యాయులు

రామకుప్పం: మండలంలో దివ్యాంగుల సర్వే నిర్వహిస్తున్నట్లు భవిత కేంద్రం ఐఈఆర్‌పీలు ఉమాదేవి,నాగభూషణం తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ రెండు బృందాలుగా గ్రామాల్లో సర్వే చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులను గుర్తించి భవిష్యత్‌లో మానసిక చైతన్యంతో పాటు విద్యలో తోడ్పడాలన్నదే సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. దివ్యాంగులను ఫిజియోథెరపీకి భవిత కేంద్రానికి పంపించేందుకు వారి తల్లిదండ్రులను ఒప్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతుల గుర్తింపునకు సర్వే

వి.కోట; సమగ్ర శిక్ష అధికారుల ఆధ్వర్యంలో18 ఏళ్లలోపు ప్రత్యేక ప్రతిభా వంతుల గుర్తింపు సర్వే మండలంలో ప్రారంభమైంది. ఈసందర్భంగా భవిత కేంద్ర అధికారులు మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా వివిధ సమస్యలతో బాధపడుతున్న 12 మంది పిల్లలను గుర్తించామన్నారు. ఇందులో ఏడుగురిని ఒకటో తరగతిలో చేర్పించామని, ఐదుగురిని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోకి తీసుకొచ్చామని తెలిపారు. వీరికి భవితా కేంద్రంలో కావలసిన సదుపాయాలను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహిత ఉపాధ్యాయులు అరుణోదయరాజ్, నాగరాజు, పీహెసీ హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ కాదు..మినీ బార్





మున్సిపల్ షాపింగ్ గదుల వద్ద పగలే మద్యం సేవనం

పలమనేరు: పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ మందుబాబులకు అడ్డాగా మారింది. స్థానిక సూపర్‌బజార్ ముందు మున్సిపాలిటీ కాంప్లెక్స్‌ను నిర్మించింది. ఇందులో కొన్ని దుకాణాలు మూతబడి ఉన్నాయి. ఈ దుకాణాల వద్ద కాస్త మరుగు ఉంటుంది. ఇది మందుబాబులకు అనుకూలంగా మారింది. పగలే మద్యం, వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులతో ఇక్కడికి వచ్చి మందుకొట్టి వెళ్తున్నారు. చీకటి పడితే అసాంఘిక కార్యక్రమాలకు కూడా ఇదో అడ్డాగా మారింది. ఇటీవల ఇక్కడే ఓ మహిళ హత్యకు గురైన విషయం తెలిసిందే. పగలే మందుబాబులు, అపరిచిత వ్యక్తులు ఇక్కడ మకాం పెడుతున్నా అక్కడికి బ్లూకోట్ పోలీసులు వెళ్లిన దాఖలాలు లేవు. పోలీసుల రాత్రి గస్తీ అంతంత మాత్రంగానే ఉండడంతో ఇక్కడ ఏమి జరుగుతున్నా పట్టించుకునేవారే కరువైయ్యారు. ఇకనైనా పోలీసులు దీనిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

రమణీయం.. కోనేటిరాయని కల్యాణం



పాల్గొన్న భక్తులు



గంగవరం: కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

గంగవరం: మండలంలోని కీలపట్లలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధి శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో బుధవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా కల్యాణోత్సవం రమణీయంగా జరిగింది. ఉదయం ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు కల్యాణోత్సవం ప్రారంభమైంది. శ్రీదేవి భూదేవి సమేతంగా కోనేటి రాయస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ఆస్థాన మండపంలోని ప్రత్యేక కల్యాణ వేదికపైకి తీసుకువచ్చి కొలువుదీర్చారు. తదుపరి మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా పండితులు కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భజన బృందాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కళాకారులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తిసాగరంలో ఓలలాడించాయి. కళ్యాణోత్సవం అనంతరం గ్రామ పురవీధుల్లో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర, ఆలయ అర్చకులు దేవరాజాచార్యులు, శ్రీహర్షదీక్షితులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కమనీయం..వెంకట్రమణస్వామి కల్యాణం

బైరెడ్డిపల్లె : పట్నపల్లె సమీపంలోని కొండపై వెలసిన శ్రీకల్యాణ వెంకటరమణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కల్యాణం కమనీయంగా సాగింది. వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించిన కళ్యాణవేదికపై సర్వాంగ సుందరంగా అలంకరించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటరమణస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు కల్యాణం తిలకించి తన్మయత్వం చెందారు.అనంతరం అశ్వవాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



బైరెడ్డిపల్లె : వెంకటరమణస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెద్ద శేషుడిపై వేణుగోపాలుని విహారం



కార్వేటినగరం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం వేడుకగా ధ్వజారోహణం జరిగింది. ఉదయం ఐదు గంటలకు స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు, అభిషేకం, శుద్ధి, తోమాల, పంచాంగ శ్రవణం, అర్చన, పుణ్యాహవచనం కార్యక్రమాలు నిర్వహించారు. 6 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడు సర్వసైన్యాధ్యక్షుడు విష్వక్సేనుడుతో కలసి మాడవీధుల్లో ఊరేగింపునకు బయలుదేరారు. లోకకల్యాణం కోసం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా జరగడానికి విష్వక్సేనుడు అష్ట దిక్పాలకులను ఆహ్వానించారు.అనంతరం 10 నుంచి 11 గంటల మధ్య కర్కాటక లగ్నంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ గరుడాళ్వార్ చిత్రపటం ఉన్న వస్త్రంతో పాటు పూలమాలలను జోడించి ధ్వజస్తంభానికి ఆరోహింపజేశారు. సాయంత్రం 5 నుంచి 6 గంటలకు మధ్య ఉభయ దేవేరులతో పాటు శ్రీవేణుగోపాలస్వామిని పట్టు వస్త్ర సుగంధభరిత పుష్పాలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చారు. ఊరేగింపుగా తీసుకువచ్చి ఊయలపై అధిష్ఠింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు.

అలరించిన సంగీత కచేరీ..

టీటీడీ ఆధ్వర్యంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుల సంగీత విభావరి భక్తులను ఆధ్యాత్మిక తన్మయత్వంలో ఓలలాడించింది.

నేత్రపర్వంగా ఊరేగింపు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు బుధవారం రాత్రి ఉభయ నాంచారులతో శ్రీవేణుగోపాలుడు పెద్దశేషవాహనంపై కోలాటాలు, చెక్కభజనలు, బాజాభజంత్రీల మధ్య పురవీధుల్లో దర్శనమిచ్చారు. భక్తులు ఇంటింటి వద్ద కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.ఆద్యంతం ఊరేగింపు నయనానందకరంగా సాగింది.

అలరించిన దుర్యోధన వధ



దుర్యోధన, భీమ పాత్రధారుల యుద్ధ సన్నివేశం

కుప్పంరూరల్: కుప్పం మండల పరిధి వెండుగంపల్లి శ్రీధర్మారాజుల ఆలయ మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో భారీ దుర్యోధనుడి ప్రతిమను మట్టితో తయారు చేశారు. అనంతరం దుర్యోధన వధ ఘట్టం ప్రారంభమైంది. చిత్తూరు నుంచి వచ్చిన కళాకారులు దుర్యోధన, భీమ, పాండవుల వేషధారణల్లో ఘట్టాన్ని రక్తి కట్టించారు. దుర్యోధన, భీమ పాత్రధారులు ఆలపించిన పద్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మండలం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. దుర్యోధన వధ ఘట్టంతో మహాభారత ఉత్సవాలు పరిసమాప్త మయ్యాయి.

ఘనంగా బాటగంగమ్మ జాతర



పూలగెరిగెలతో ఊరేగింపుగా వెళుతున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె: మండలంలోని పాతపేటలో బుధవారం బాటగంగమ్మ జాతర వైభవంగా జరిగింది. పూలగెరిగెలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి ఆలయం వద్ద అమ్మవారిని ప్రతిష్టించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద పలు దుకాణాలు ఏర్పాటు చేశారు. జనసందోహంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.

ఉత్కంఠ రేపుతున్న కౌంటింగ్

- ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాల పైనే చర్చలు
- విజయంపై ధీమాలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు





చిత్తూరు కార్పొరేషన్: సార్వత్రిక ఓట్ల లెక్కింపు సమీపిస్తున్న కొద్దీ అందరిలో ఉత్కంఠ పెరుగుతోంది. ఎక్కడ చూసినా కౌంటింగ్ పైనే చర్చ. ఏ ఇద్దరు కలిసినా విజయం ఎవరిని వరిస్తుందనే అంశంపైనే విశ్లేషణలు జోరుగా కొనసాగుతున్నాయి. మరో పక్క జూన్ 4న చిత్తూరులోని ఎస్వీసెట్‌లో జరిగే కౌంటింగ్‌కు శరవేగంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని పార్లమెంట్, 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. 2019లో ఏప్రిల్ 11న ఎన్నికలు జరగ్గా ఫలితాల కోసం 41 రోజులు ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సారి 21 రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితి.

ఐదు రోజులే గడువు

కౌంటింగ్‌కు నేటికి మరో 5 రోజులు మాత్రమే గడువుంది. వచ్చే మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. ఒక్కో రౌండ్ దాదాపు గంట సేపు లోపలే ముగించే అవకాశం ఉంది. ఈ లెక్కన చిత్తూరు నియోజకవర్గంలోని 226 పోలింగ్ బూత్‌ల పరంగా 14 టేబుళ్ల చొప్పున లెక్కిస్తే దాదాపు 17 రౌండ్ల లెక్కింపు జరపనున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్స్ వచ్చేస్తుంది. పోలింగ్ సరళిని బట్టి ఇప్పటికీ పోటీలో నిలిచిన అధికార, విపక్ష పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు గ్రామాలు, వార్డుల వారీగా తమకు వచ్చే ఓట్లపై అంచనాల్లో ఉన్నప్పటికీ గడువు సమీపిస్తుండడంతో ఉత్కంఠ పెరిగిపోతోంది. కౌంటింగ్ రోజు కోసం ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మ రోపక్క గ్రామాలు, పట్టణాల్లో ఏ ఇద్దరు కలిసినా ఎన్నికల ఫలితాలపైనే చర్చించుకుంటున్నారు. జిల్లాలోని పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాల్లో పోటీలోని అభ్యర్థుల విజయావకాశాలు, విజయం సాధిస్తారనుకునే వారి మెజారిటీ ఎంతవరకు రావచ్చు. రాష్ట్రంలోని ముఖ్యనేతల విజయావకాశాలు, ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది. కేంద్రంలో ఏ పార్టీ సంపూర్ణ ఆధిక్యత సాధిస్తుంది? గత ఎన్నికల ఫలితాలను బేరీజు వేస్తూ పలు అంశాలపై ఎక్కడ చూసినా జోరుగా చర్చలు జరుగుపుతూ, బెట్టింగ్ చేస్తున్నారు.

ప్రభుత్వ పథకాలపై జనం ఫిదా..

2019 ఎన్నికల్లో రాష్ట్రంలో 175 స్థానాలకు 151 స్థానాలతో వైఎస్సార్‌సీపీ చారిత్రాత్మక విజయం సాధించింది. జిల్లాలోని పార్లమెంట్ స్థానం, 7 అసెంబ్లీ స్థానాల్లో కుప్పం మినహాయించి ఆరు అసెంబ్లీ స్థానాల్లో విజయ కేతనం ఎగురవేసింది. ఈ ఐదేళ్లలో కనీవినీ ఎరుగని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, కూటమిలో అంతర్గత కుమ్ములాటలతో ఈ సారి క్లీన్ స్వీప్ ఖాయమన్న ధీమాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఉన్నారు. పోలింగ్ శాతం పెరగడం , అర్ధరాత్రి వరకు వృద్ధులు, మహిళలు క్యూలో నిలబడి ఓట్లు వేయడం వంటి పాజిటివ్ ఓటుకు నిదర్శనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.